**కథ**

**"ఏమిటోయ్ అంత ఆలోచన!" వంశీ నా భుజం మీద చేయి వేసి పక్కన కూర్చుంటూ అన్నాడు.**

**ఆలోచనల నుంచి తెప్పరిల్లి "అబ్బే ఏం లేదు!" అన్నాను.**

**నా కళ్లల్లోకి దీర్ఘంగా చూస్తూ "ఓయ్ ఏదో ఉంది! నిజం చెప్పు!"**

''శ్రావణికి ఫ్రెండ్స్ బాగా ఎక్కువయ్యారు. ఎంతసేపు వాళ్లతో తిరుగుతూ ఇంటికి లేటుగా వస్తోంది. గట్టిగా అడుగుదామంటే మార్కులు బాగానే వస్తున్నాయి బానే చదువుతోంది కానీ తల్లిగా భయపడుతున్నాను.''

''ఓస్ ఇంతేనా! ఇంకా ఏమిటో అని హడలిపోయాను కదా, మాలా ఏంటోయ్, మన డిగ్రీ రోజులు, కాలేజీ ఎగ్గొట్టి మనం చూసిన సినిమాలు, చేసిన షికార్లు అన్నీ అప్పుడే మర్చిపోయావా? మనమేమో మన తల్లిదండ్రులు చూడకుండా చాటుగా తిరిగే వాళ్లం. ఇప్పటితరం బాహాటంగా తిరుగుతున్నారు. అంతే తేడా! వాళ్లు ఎంత బాగా, హాయిగా జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నారు? రియల్లీ, ఇప్పటి పిల్లలు చాలా అదృష్టవంతులు''

''ఏంటీ డాడీ ఎవరిని అదృష్టవంతులంటున్నావ్!'' అంటూ సుడిగాలిలా మేడ మెట్లు దిగి శ్రావణి వచ్చి తండ్రి పక్కలోకి చేరింది.

''శ్రావణి హండ్రెడ్ ఇయర్స్! ఇప్పుడే నీ గురించే మాట్లాడుకుంటున్నాం, ఇలా ప్రత్యక్షమయ్యావు!'' వంశీ శ్రావణిని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

''ఏమిటో అంత విశేషం'' నవ్వుతూ అంది.

''శ్రావణి, అమ్మ నీ గురించే భయపడుతోంది, నువ్వు ఫ్రెండ్స్‌తో తిరుగుతూ రోజూ లేటుగా వస్తున్నావని కంప్లైంట్ చేస్తోంది!'' హాస్యంగా అన్నాడు నాకేసి చూస్తూ.

''రియల్లీ! అమ్మా!'' శ్రావణి కళ్లలో ఆశ్చర్యం!

నన్ను పక్కకు తీసిపడేసినట్లు ఇద్దరూ ఆశ్చర్యంగా మాట్లాడుతుంటే నాకు కోపం వచ్చేసింది.

''వంశీ! బీ సీరియస్! శ్రావణి, నేను చెప్పేది విను! నీకు డాడీ వెహికల్ కొనిచ్చారు, అందులో వెళ్లు! అంతే! రోజూ మీ ఫ్రెండ్స్‌తో కలిసి వెళ్లడం నాకేం నచ్చడం లేదు! అలాగే లేటుగా రావడం అంతకన్నా నచ్చడం లేదు'' కటువుగా అన్నాను!

శ్రావణి ముఖం ఒక్క క్షణం మ్లానమయ్యింది, మరుక్షణం చిన్నగా నవ్వేసి, నా పక్కగా వచ్చి కూర్చుని-

''నా పిచ్చి అమ్మా! ఏమిటీ చాధస్తం! నిజం చెప్పు, నా మీద నమ్మకం లేదా''

''నీ మీద నమ్మకం ఉంది, కానీ నీ వయసు మీద నమ్మకం లేదు శ్రావణి!''

''అమ్మా! ప్లీజ్! అర్థం చేసుకో, మేమందరం ఫ్రెండ్స్! జస్ట్ ఫ్రెండ్స్. అంతే! ఏదేదో ఊహించుకుని ఊరికే బాధపడకు. నా లైఫ్‌ని ఎలా తీర్చిదిద్దుకోవాలో నాకు బాగా తెలుసు'' శ్రావణి కాన్ఫిడెన్స్‌గా మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యం, ఆవేదన రెండు కలిగాయి ఏకకాలంలో.

# నిరీక్షణ

బ్లూ జీన్స్ పైన పొట్టి టీ షర్టు, వదిలేసిన జుట్టు, ఆధునిక యువతికి ప్రతీకగా ఉంది శ్రావణి!

''మాలా! శ్రావణి చిన్న పిల్లేం కాదు! తనకేం కావాలో తనకి బాగా తెలుసు!'' వంశీ ఈ విషయం వదిలేయమన్నట్టుగా నాకు సైగ చేస్తూ అన్నాడు!

''అమ్మా! వాళ్లతో కలిసి తిరిగినంత మాత్రాన వాళ్లెవరినయినా ప్రేమించేస్తానా? పెళ్లి చేసుకుంటానా? చెప్పు? సుధాకర్ వాళ్లు చాలా పూర్! అతన్ని చేసుకుని నేను సెటిల్ అవుతాననుకున్నావా?

మధు వాళ్ల స్టేటస్ ఒకే, కానీ మధుది చాలా ఫికిల్ మైండ్, అతని స్టేట్‌మెంట్ క్షణక్షణానికి పూర్తిగా మారిపోతుంది. అమ్మా, మీ కాలంలో ఓ అమ్మాయి, అబ్బాయి పక్కపక్కన ఉంటే అతను ప్రియుడో, మొగుడో లేదా 'అన్నయ్య' ఇలా ఏదో ఒక వరస అందరి ఎదురుగుండా కలిపేసుకోవడమే మీకు తెలుసు! ఇంకో రిలేషన్ మీకు అబ్బాయిలతో లేనే లేదు! కనీసం ఊహించనూ లేరు. కానీ అమ్మా! ఇప్పటి మా తరంలో అబ్బాయిలందరూ మాకు ఫ్రెండ్స్! జస్ట్ ఫ్రెండ్స్ అంతే! సరదాగా తిరుగుతాం, కబుర్లు చెప్పుకుంటాం, పోటీ పడి చదువుతాం! అంతే! అంతకుమించి మాకు వేరే ఆలోచనేం లేదు! నువ్వా మనసులో ఏదీ పెట్టుకోకు! ప్లీజ్ అర్థం చేసుకో!''

శ్రావణి అలా ఫ్రీగా మాట్లాడుతుంటే ఆలోచిస్తూ వింటున్నాను!

**కె.వాసవదత్త రమణ**

'అంతేనా! అబ్బాయిలతో కళ్లు కళ్లు కలిపి మాట్లాడుతూంటే ఇంకే ఆకర్షణ ఉండదా! ఏ ప్రేమ కలగదా? అంత ప్రాక్టికల్‌గా ఉండటం సాధ్యమా?' నా మనసులో ఎక్కడో గతం మెదులుతోంది.

''అయినా ఇంతవరకు వచ్చింది కాబట్టి చెబుతున్నాను. డాడీ మన రాజు అంకుల్ వాళ్లబ్బాయి సిద్ధు లేడు, అదే సిద్ధార్థ!'' అంటూ ఆగింది.

''ఎవరు! మొన్న అమెరికా వెళ్లిన అబ్బాయా!'' వంశీ అడిగాడు.

''ఎస్! అతనే డాడీ! నాకు 'ఇ-మెయిల్' పంపాడు. తన బయోడేటా అంతా పంపుతూ, లాస్ట్‌లో 'ఇదంతా నా చదువు, ఉద్యోగం సంగతి, కానీ ప్రతి మనిషి లోపల మనస్సనేది ఉంటుంది కదా! శ్రావణి ఆ మనసు చాలా కాలం బట్టి నీ చుట్టే తిరుగుతోంది. సెటిల్ అయ్యాను కాబట్టి, నేను నా మైండ్ ఓపెన్ చేస్తున్నాను, నిన్ను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను. నీ జవాబు కోసం వెయిటింగ్ విత్ లాట్ ఆఫ్ టెన్షన్' అంటూ మెయిల్ చేశాడు!''

''నాకు ఓ.కేనే! అయినా నాకు ఇంకో ఇయర్ ఇంజనీరింగ్ చదువు ఉంది కదా, ఈలోపు మీరూ అతన్ని గురించి ఆలోచించండి!'' చివర్లో కొద్దిగా సిగ్గుపడుతూ అంది శ్రావణి!

''శ్రావణి! నైస్ డెసిషన్!'' వంశీ పొంగిపోతూ అన్నాడు. ''అయినా దొంగా నీకిష్టమైంది కాబట్టేగా. ఈ ప్రపోజల్ మా ముందు పెట్టావు అంతేనా!''

''ఓయ్! మాలా! రాజుతో రేపే వెళ్లి మాట్లాడుదాం, చాలా మంచి సంబంధం! ఇప్పుడు నీ సందేహాలన్నీ తీరినట్టేనా! చెప్పు, ఏమైనా శ్రావణి, నా కూతురోయి, నాకులాగ ఇష్టపడింది సాధించి తీరుతుంది. శ్రావణి! వెరీగుడ్ సెలక్షన్!'' అన్నాడు నవ్వుతూ!

''ఎంత ఎదిగిపోయింది నా కూతురు!'' ఆశ్చర్యపోతూ అన్నాను.

''అమ్మా! నీ పెంపకంలో పెరిగిన దాన్ని, నేను తప్పుగా ఆలోచిస్తానని అసలు నువ్వెలా అనుకున్నావు, చెప్పు?'' గోముగా అంది.

వంశీ నవ్వేస్తూ ''మీ అమ్మ మా పెళ్లికి ముందు ఇలాంటి ఎడ్వెంచర్స్ చాలా చేసింది, అందుకే అలా భయపడుతోంది'' కొంటెగా అన్నాడు నాకేసి చూస్తూ.

అతని వంక చురుగ్గా చూసి ''వంశీ, ఓ పక్క అక్కడక్కడా నీ జుట్టు తెల్లబడుతోంది, చెంపలు నెరుస్తున్నాయి, ఎంత సూటు బూటు వేసుకుంటే మట్టుకు మీరు చిన్నపిల్లలవుతారా! ఎదిగిన కూతురు ముందర ఇలాగేనా మాట్లాడేది'' చిరుకోపంగా అన్నాను.

''శ్రావణి! మీ అమ్మ ఇప్పుడు ఇలా మాట్లాడు



తుంది
కానీ నీకులాగే తనకి
చాలామంది బాయ్‌ఫ్రెండ్స్! అందరి
ఏరికోరి నన్ను సెలెక్ట్ చేసుకుంది తెలుసా?'' ఆరాధనగా అన్నాడు వంశీ నాకేసి చూస్తూ!

''అమ్మా! చెప్పు! డాడీని, నువ్వు ఫస్ట్ టైం ఎప్పుడు చూశావు? చెప్పమ్మా!'' శ్రావణి బలవంతంతో నాలో జ్ఞాపకాలన్నీ అలల్లా ముందుకు తోసుకువచ్చాయి!

'వంశీనా నేను ముందు ఇష్టపడింది కాదు కాదు విక్కీ..ని?'

'విక్కీ! విక్కీ! ఎక్కడున్నావు! నన్ను వదిలి పెట్టి ఎంత దూరం వెళ్ళిపోయావు! విక్కీ! విక్కీ! ఒక్కసారి కనపడవా?'

★ ★ ★

''విక్రమ్! ప్రిన్సిపల్ నిన్ను వారం రోజులు సస్పెండ్ చేశాడు, ఏమిట్రా ఇది?'' వంశీ ఆవేదనగాఅన్నాడు.

''సురేశ్‌తో గొడవ పడి అనవసరంగా అతన్ని కొట్టావు? ఎందుకిలా చేస్తున్నావు?''

''అబ్బబ్బా! ఆపండిరా మీ గోల! వాడేమో మన క్లాసుమేటు స్వప్నను పట్టుకుని రేగింగ్ చేయటం తప్పు కాదా? రాస్కెల్, ఎంత ధైర్యం వాడికి?'' అన్నాడు విక్రం కోపంగా.

''విక్రమ్! కొన్ని చూసి చూడనట్టు వదిలేయాలి, లేకపోతే కంప్లైంట్ చేయాలి'' వంశీ విక్రమ్ భుజం మీద చేయి వేస్తూ అన్నాడు.

ఆ చేయిని విసురుగా తోసేసి.

''తప్పు చేసినవాడ్ని వదిలేయాలా? నెవర్! అయినా అప్పుడే ఎక్కడ అయింది లే! నన్ను సస్పెండ్ చేయించినందుకు గాను వాడికి ఎలా బుద్ధి చెప్పాలో నాకు బాగా తెలుసు! చూస్తూ ఉండండి'' అన్నాడు.

''వెరీగుడ్! రాత్రి వాడి కాలో, చెయ్యో తీసేసి రేపు జైల్లోకి వెళ్ళి కూర్చుందువు గాని! ఆ శాస్తి వాడికి సరిపోతుందా! లేకపోతే ప్రాణాల్ని కూడా తీసేయాలా?'' చెప్పు విక్కీ!

మాలతి గొంతు విని అబ్బాయిలందరూ పక్కకి తిరిగారు!

మాలతిని చూడగానే విక్రమ్ మౌనంగా ఉండి

పోయాడు!

."విక్కీ! చెప్పు, ఎందుకిలా చేస్తున్నావు? నీ ఆవేశాన్ని తగ్గించుకోలేవా? ఇలాగైతే నీ చదువు ఏమైపోతుంది? నీ భవిష్యత్తును నీ చేజేతులారా ఎందుకు నాశనం చేసుకుంటున్నావు?"

"అది అలా చెప్పు మాలా! చిన్నప్పట్నుంచి కలిసి పెరిగినా, వాడు అందరికంటే నీ మాటకే ఎక్కువగా విలువనిస్తాడు!" వంశీ అన్నాడు!

"చలో, ఆకలవుతుంది, ముందు క్యాంటిన్‌కి పదండి, అక్కడ మాట్లాడుకోవచ్చు!" ప్రసాద్ అనగానే అందరూ కదిలారు. మాలతి, విక్రమ్ కొంచెం వెనకగా నడిచారు.

మాలతికి కోపం తగ్గలేదన్న విషయం గ్రహించుకున్న విక్రమ్ మాటలు కలుపుదామనుకున్నట్టుగా,

"మాలా! వదిలేయి! నా దృష్టిలో అందరూ ఒక ఎత్తు, నువ్వు ఒక ఎత్తు! నువ్వు కూడా నన్ను అపార్థం చేసుకుంటే ఎలా?" అన్నాడు. కోపాన్ని అదిమిపెట్టుకుంటూ విక్కీకేసి సూటిగా చూసింది.

ఆరడుగుల ఎత్తు, నిర్లక్ష్యంగా ఎగురుతున్న జుత్తు, పల్చటి చెంపలు, రఫ్‌గా గెడ్డం- ఎవరయినా చూస్తే రౌడీలా అనిపిస్తాడు. 'కానీ ఆ రాతి మనిషి వెనక ఎంత వెన్నలాంటి మనసు ఉందో, అది రుచి చూసిన నాకే తెలుసు!' అనుకుంది మనసులో!

ఆవేశానికి, ఉద్రేకానికి మారుపేరు విక్రమ్! ఎక్కడ తప్పు జరుగుతుందో అక్కడ క్షణంలో ప్రత్యక్షం అవుతాడు! అంతే అక్కడ గొడవలు, అల్లర్లు!

తండ్రి ఎంతో కష్టపడి కొడుకు చదువు కోసం డబ్బు పంపిస్తుంటే, అది షికార్లకు, పార్టీలకు తగలేస్తున్న స్టూడెంట్‌ను రోడ్డుమీదే చితక్కొట్టేశాడు! సినిమా టిక్కెట్లు బ్లాకులో అమ్ముతుంటే ఆ థియేటర్ మేనేజర్‌ను పట్టుకుని కొట్టేశాడు! ఆ రోజు మాలతి పక్కనే లేకపోతే ఆ గొడవకి ఈపాటికి జైల్లో ఉండేవాడు. అతని ఆవేశాన్ని ఎలా అదుపులో పెట్టాలో మాలతికి అసలు అర్థం కావట్లేదు.

"మాలా!" ప్లీజ్! నా మీద కోపం పోదా? ఈసారి నుంచి నువ్వేం చెబితే అదే చేస్తాను!" విక్రమ్ బుజ్జగించటం మొదలుపెట్టాడు.

"అబ్బా! ఈ సీన్లు ఎన్ని చూడలేదు!" వంశీ వెనక నుంచి అరిచాడు!

"ఒరేయ్ మిత్రద్రోహి! మా మధ్య చిచ్చు పెట్టకు! ఇప్పుడే దేవిగారు కొంచెం వశమవుతున్నారు! మాలా! రియల్లీ సారీ!" దీనంగా అన్నాడు విక్రమ్!

"మాలా అస్సలు జారిపోకు! విక్కీది అంతా ఏక్షన్?" ప్రసాద్ గొడవకి పక్కుమని నవ్వింది. విక్రమ్ 'థాంక్స్ మాలా' అన్నాడు.

"విక్కీ లాస్ట్ వార్నింగ్! మళ్లీ ఏ గొడవలో తల దూర్చకుండా పరీక్షలకి బాగా ప్రిపేర్ కావాలి! రండి అందరం వెళ్లి ప్రిన్సిపల్‌ని విక్కీ సస్పెన్షన్ కాన్సిల్ చేయమని రిక్వెస్ట్ చేద్దాం!" అంది మాలతి.

విక్రమ్ కూడా ఏ కళనున్నాడో నెల రోజులు పుస్తకం వదల్లేదు. అతనిలో మార్పుకి ఫ్రెండ్స్ అందరూ చాలా సంతోషించారు. మాలతికి సంతోషంగా అనిపించింది. పరీక్షలు కాగానే అందరూ సినిమాకి, హోటల్‌కి వెళ్లి సెలబ్రేట్ చేసుకున్నారు.

★ ★ ★

"నీతో కొంచెం మాట్లాడాలి," తండ్రి రాజారావు అనగానే ఆశ్చర్యపోతూ "నాన్నగారు, ఏమిటండీ!" అంది మాలతి.

"మాలతి నాకు డొంకతిరుగుడు చాతకాదు. విషయం సూటిగా చెబుతున్నాను, మాకున్నది నువ్వొక్కదానివే! నా ఆశలన్నీ నీ మీదే ఉన్నాయి, నిన్ను స్వేచ్ఛగా పెరగనిచ్చాను కూడా"


"ఇప్పుడేమయింది!" తండ్రి ధోరణి మాలతకి అర్థం కాలేదు.

"నీ చదువు పూర్తయింది, రెండు మూడు మంచి సంబంధాలు రెడీగా ఉన్నాయి, అందుకే ఈ మేలో నీ పెళ్లి చేద్దామనుకుంటున్నాను! నీ ఫ్రెండ్, అదే విక్కీ. అతను లింగంపల్లిలో ఎవరో దళం సభ్యుడితో కనపడ్డాడట. మొన్న పార్టీలో ఇన్‌స్పెక్టరు చెప్పాడు. అది చెప్పడమే కాదు, 'అతనితో మీ అమ్మాయిని రెండు మూడు సార్లు చూశాను, అతన్ని మీ అమ్మాయిని కలవద్దని, మంచిది కాదని చెప్పండి!' అన్నాడు"

ఆమెకి తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. అలాగే స్థాణువులా నిలబడిపోయింది, పక్కనే కుర్చీని ఆనుకుంటూ!

"మాలతి, విషయం చెప్పాను! నువ్వేం చేయాలో నీకు బాగా తెలుసు" రాజారావు అన్నాడు.

★ ★ ★




"మాలా!" విక్రమ్ పిలుపు విని మాలతి వెనక్కి తిరిగింది!

"మాలా, ఇద్దరికీ ఫస్ట్‌క్లాసులు వచ్చాయి! హ్యాపీనా చెప్పు? సెలబ్రేట్ చేసుకుందామా?" అన్నాడు విక్రమ్!

అప్రయత్నంగా అతని వెనక బండెక్కి కూర్చుంది! టాంక్ బండ్ మీద ఆపాడు!

సాయంత్రం గాలులు చల్లగా వీస్తున్నాయి, సూర్యుడి అస్తమయం నీటిలో అందంగా కనబడుతోంది.

"మాలా! ఇలా రాళ్లు నీళ్లలో విసురుతుంటే భలే సరదాగా ఉంటుంది నీళ్లు అలలు అలలుగా సుళ్లు తిరుగుతూ ఉంటే ఎంత బాగుంటుందో కదా!" అన్నాడు నేలమీద రాయిని తీసి నీటిలో విసురుతూ!

అతని చిన్నపిల్లాడి మనస్తత్వం చూసి 'నాలోని ప్రేమ ఈ మనిషికి ఎప్పటికి అర్థం అవుతుంది!' మాలతికి మనస్సు ఉస్సూరుమంది.

"మాలా నేనొక్కటి చెప్పనా? నాకు ఉద్యోగం చేయాలని లేదు! అలాగని నిన్ను వదులుకోవడానికి సిద్ధంగా లేను. అందుకే ఏదయినా జాబ్ చూసుకుంటాను! మరి నన్ను పెళ్లిచేసుకుంటావా!" సూటిగా అడిగాడు విక్రమ్.

విక్కీ మాటల్లోని నిజాయితీని మాలతి గుర్తించినా-

"చేయి పట్టుకోవడాలు లేవు, సిగ్గు పడటాలు లేవు, చెంపలు ఎర్రబడటం, మనసు స్పందించడం ఏదీ లేదా- ఇదేనా ప్రేమంటే, నువ్వు నా దానివే అన్న ధీమానా లేక ప్రాక్టికాలిటినా?" మాలతి ఆలోచిస్తూ ఉండిపోయింది.

"ఓయ్! మాలా! సే ఎస్ ఆర్ నో! నువ్వు నాకు కావాలి! ఓ.కె.నా!"

"విక్కీ! నేను నా నిర్ణయం చెప్పే ముందు, నువ్వు నాకో నిజం చెబుతావా!"

"నేనా! నీ నుంచి ఎప్పుడైనా ఏదైనా దాచానా చెప్పు?"

"అయితే లింగంపల్లిలో నువ్వు తరచుగా కలుస్తున్న వ్యక్తి ఎవరు? చెప్పు?" మాలతి సూటిగా వేసిన ప్రశ్నకి విక్రమ్ ముఖం తిప్పుకున్నాడు.

"ఎవరు! నాకు అన్ని చోట్లా బోలెడుమంది ఫ్రెండ్స్ ఉన్నారు. ఎవరో ఏమిటో?"

"విక్కీ! దమాయించకు! నేను ఎవరి గురించి అడుగుతున్నానో నీకు బాగా తెలుసు"

"మాలా! అన్ని విషయాలు తెలుసుకున్నదానివి మరి ఆ వ్యక్తి ఎవరో కనుక్కోలేకపోయావా!" వెటకారంగా అన్నాడు.

''విక్కీ! అదీ తెలుసుకున్నాను. కానీ నీ నోటి వెంట నిజం ఏమిటో చెప్పాలి. నీ ఆవేశాల్ని, లోటుల్ని అన్నింటినీ ఇప్పటివరకు కప్పిపుచ్చుకుంటూ నీ వెంటే వస్తున్నాను! అది స్నేహమో, ప్రేమో నేను చెప్పలేను, కానీ ఈ విషయం మటుకు అబద్ధం అని నాకు తెలియాలి'' దృఢంగా అంది.

విక్కీ నిర్లక్ష్యంగా తలెగరేసి, మాలతి పక్కనుంచి లేచి ఎదురుగా ఉన్న నీళ్ల వంక తదేకంగా చూస్తూ-

''మాలా! వదిలేసెయి! చిన్న విషయాన్ని రభస చేయకు! నువ్వంటే నాకు ప్రాణం! నిన్ను పెళ్లి చేసుకుంటాను! నిన్ను ఏ లోటు రాకుండా చూసుకుంటాను ఇంత కంటే నీకు ఇంకేం కావాలి?'' అన్నాడు.

''విక్కీ! ఏ ఆడదైనా కోరుకునేది నిశ్చింతగా సాగే సంసార జీవితాన్ని! అది నువ్వు ఇవ్వగలవా? నీ పంథా మార్చుకోగలవా? ఆలోచించుకో! మార్చుకోగలిగితే రేపు మా నాన్నగారితో మాట్లాడి నా చేయి అందుకో! మా నాన్నగారి బిజినెస్ నువ్వు అందుకుంటే మన జీవితం హాయిగా సాగుతుంది!'' మాలతి అంది.

రెయిలింగ్‌ని అనుకుని వెనక్కి తిరిగి మాలతి కేసి సూటిగా చూస్తూ-

''మాలా! రేపటి వరకు అక్కర్లేదు ఇప్పుడే చెబుతున్నాను. నా ఆవేశాల్ని, ఆశయాల్ని, అర్థం చేసుకుని నాతో సహకరిస్తావనుకున్నాను. నీ ప్రేమతో నేను మరిన్ని విజయాలు సాధించవచ్చు అనుకున్నాను. నా సుఖం కోసం, కేవలం నా ఒక్కడి సుఖం కోసం, వేలాది మంది సుఖాల్ని నేను పణంగా పెట్టలేను. నేను సంఘం మనిషిని. నీ ఒక్కడికే పరిమితమవ్వాలని నువ్వు కోరుకోవడం నీ అవివేకం! ఇప్పుడు నేను కాదు ఆలోచించాల్సింది! నువ్వే!''

విక్రమ్ మాటలు మాలతి గుండెల్లో ఫిరంగుల్లా పేలాయి. అతని విపరీత ధోరణికి తట్టుకోలేక, అతికష్టం మీద వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ-''అది కాదు విక్కీ'' అంటూ చెప్పబోయింది.

''మాలా! నాకీ ఎమోషన్స్ నచ్చవు! బీ ప్రాక్టికల్. నా మార్గం నీకిష్టమయితేనే మన పెళ్లి జరుగుతుంది. లేదా ఇంతకు ముందు ఫ్రెండ్స్‌లా ఎలా ఉన్నామో అలాగే ఉందాం అంతే''

కన్నీటి సుడులతో మసకమసకగా కనబడుతున్న విక్రమ్ రూపాన్ని చూస్తూ అలాగే కూర్చుండిపోయింది మాలతి!

★ ★ ★

ఫుట్‌బాల్ ఫైనల్ మాచ్ జరుగుతోంది. విక్కీ అందరిలో ప్రధాన ఆటగాడు. మాలతి ఫ్రెండ్స్ అందరూ స్టేడియంకి వచ్చి ఆటను చూస్తున్నారు.

మాలతి, వంశీ, ప్రసాద్ అందరూ వరుసగా మెట్ల మీద కూర్చున్నారు. ఆమె దూరంగా కనిపిస్తున్న విక్కీని చూస్తోంది! బాల్‌ని జరుపుతూ, విక్రమ్ చురుగ్గా గ్రౌండంతా తిరుగుతున్నాడు.

'ఆ రోజు తర్వాత, విక్కీ మళ్లీ కలవలేదు, మాట్లాడలేదు. ఎంత రాతి గుండె' ఉస్సూరంది మాలతి మనసు!

''మాలా! నిన్నో విషయం అడగనా?'' వంశీ అడిగాడు.

''ఏమిటి వంశీ?'' విక్కీ ఆటకేసి తదేకంగా చూస్తూ అంది మాలతి!

''మాలా! నేను నిన్ను ప్రేమిస్తున్నాను! ఆలోచించుకుని జవాబు చెప్పు! వచ్చే నెల అమెరికా వెళుతున్నాను. నాకు మాటలు అందంగా పేర్చడం రాదు, కానీ లేటు చేయకుండా నన్నో, విక్కీనో త్వరగా తేల్చుకో!'' ఉలిక్కిపడి వంశీ వంక చూసింది!

అతని కళ్లు నిర్మలంగా ఉన్నాయి!

''వంశీ!'' తడబాటుగా అంది మాలతి!

★ ★ ★

''మాలతి! వంశీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీ ఎం.డి. రామక్రిష్ణారావుగారి వాళ్ల అబ్బాయి నిన్ను వంశీకి అడగటానికి వచ్చారు. చాలా మంచి మ్యాచ్, మాకు నచ్చింది. ఆ అబ్బాయి నీ క్లాస్‌మేట్‌ట కదా! నీ అభిప్రాయం ఏమిటి?''

తండ్రి మాటలకు మాలతి మనస్సు డోలాయమానంగా ఊగింది. అటు వంశీ వాళ్లు, ఇటు ఇంట్లో వాళ్లు కూడా పచ్చ జెండా ఊపారు, మరి విక్రమ్ ఎర్రలైటులో ఎర్రగా అలాగే పట్టువదలకుండా ఉన్నాడు.

''ఏం చేయాలి?''

''అలాగే నాన్నగారు! మీ ఇష్టం!'' అంటూ తల వంచింది నిస్సహాయంగా!

★ ★ ★

మాలతి ఆలోచిస్తూ అలాగే సోఫాలో కూర్చుండిపోయింది గతాన్ని, వర్తమానాన్ని విడదీయలేని సంఘర్షణలో!

ఇంటి ముందు పోర్టికోలో సర్రున కారు వచ్చి ఆగింది. ''శ్రావణీ రా'' అంటూ అందరూ అక్కడ్నుంచే గట్టిగా అరుస్తున్నారు! ''అరే అంతా వచ్చేసారే! డాడీ, మమ్మీ, సారీ నీకు మమ్మీ అంటే ఇష్టం ఉండదు కదా, అమ్మా బై, వెళ్తున్నాను!'' శ్రావణి తుఫానులా పరుగెత్తింది బయటికి! కారు వెళ్లిపోయింది!

''మాలా!'' మృదువుగా పిలిచాడు వంశీ!

''మాలా! నీకేమయినా లోటు చేశానా! నా ప్రేమలో లోపం ఏమన్నా ఉందా! ఇంకా ఎందుకు బాధపడుతున్నావు!'' అంటూ ఆమె భుజం చుట్టూ చేయి వేసి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

''లేదు వంశీ, నాకు నువ్వేం లోటు చేయలేదు! నన్ను మహారాణిలా చూసుకున్నావు! కానీ వంశీ! విక్కీ ఎక్కడున్నాడో? ఏమైపోయాడో?'' అతన్ని పెనవేసుకుపోతూ భోరుమంది మాలతి!

''మాలా! ఊరుకో! విక్కీ, ఎక్కడో అక్కడ ఉండే ఉంటాడు. త్వరలోనే వస్తాడు'' అన్నాడు.

''వంశీ! అతను కనిపించి ఎన్ని సంవత్సరాలైంది చెప్పు? ఒక్కసారి విక్కీని కళ్లారా చూడాలి! అతను క్షేమంగా ఉన్నాడని తెలిస్తే, నాకంతే చాలు!'' కన్నీళ్లు తుడుచుకుంటూ అంది!

''మాలా! విక్కీ తప్పక వస్తాడు. ప్రతి మనిషిలో, ప్రతి మనసులో మార్పు రావాలి! తోటివాడికి హాని చేయకుండా మన జీవితం గడపాలి అన్న ఆలోచన ప్రతి మనిషిలోనూ ఉదయించిన నాడు, సమాజ స్థితిగతుల్లో మార్పు వస్తుంది. అంతేకానీ ఏ ఇజాలు, ఏ సిద్ధాంతాలు, ఏ రక్తపు విప్లవాలు, సమాజ స్వరూపాన్ని రాత్రికి రాత్రే మార్చేయలేవు! ఆ నిజం తెలుసుకున్న రోజున విక్కీ తప్పక తిరిగి వస్తాడు మాలా! మన విక్కీ తప్పక వస్తాడు!''

ఆవేదన సుళ్లు తిరుగుతున్న కంఠంతో ఓదారుస్తూ అన్నాడు వంశీ.

అతని మాటలకి ఏకీభవిస్తున్నట్లుగా తలూపి అతని గుండెల మీద తలవాల్చింది మాలతి!

కానీ మాలతికి తెలియని నిజం, వంశీకి ఒక్కడికే తెలిసిన నిజం ఒక్కటుంది. అదే విక్రమ్ అరణ్యాల్లో మరణించి చాలా కాలమైందని!! ఇంకెప్పటికీ తిరిగి రాడని!

ఆమె నిరీక్షణ ఫలించదని!

